25032025-DIS-04_Layout 1 3/25/2025 3:26 AM Page 1

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

తమ్ముళ్లకు తోడై.. నిలిచే నీడై!

ఓటు చేజారింది. బతుకు దిగజారింది. మాయమాటలతో గద్దెనెక్కిన రాజకీయం చుక్కలు చూపిస్తున్నది. దిక్కుతోచక ప్రజలు దిక్కులు చూస్తున్నారు. తెలంగాణలో నెలకొన్న సంక్షుభిత వాతావరణంలో బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాటలు ప్రజలను కొంతలో కొంత ఊరడిస్తున్నాయి. కష్టాల్లో ఉన్న ప్రజలకు, తికమక పడుతున్న కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నాయి. అదొక ఆత్మీయ ఆలింగనం. భయపడొద్దు నేనున్నాననే భరోసా. రేపటి మీద నమ్మకం కలిగించే ఆశ. ఇదీ నిజం అనే కనువిప్పు. పార్టీ రజతోత్సవ సన్నాహాల్లో భాగంగా కేటీఆర్ జిల్లా యాత్రలు చేపట్టినప్పటికీ, అవి రోజురోజుకూ ప్రజలతో ఆయన అనుబంధాన్ని మరింత పటిష్ఠపరిచే అభిమాన యాత్రలుగా మారుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సమర శంఖారావాలు పూరిస్తున్నాయి. సభలు సాగుతున్న తీరు ఉద్యమ కాలంలో పార్టీ అధినేత కేసీఆర్ జరిపిన పర్యటనలు, సభలను స్ఫురణకు తెస్తున్నవి.

ఉద్యమం బలహీనపడినప్పుడల్లా, కార్యకర్తల్లో నైరాశ్యం పొడసూపినప్పుడల్లా కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి తన వ్యూహ చతురతతో, వాక్పటిమతో కొత్త ఉత్సాహాన్ని నింపేవారు. ఇప్పుడూ తెలంగాణ సమాజంలో తీవ్ర నిరాశా నిస్పృహలు ఆవరించి ఉన్నాయి. ప్రజల్లో దుఃఖమున్నది. అది ఆత్మీయ నేత పలకరింపుతో కట్టలు తెంచుకుంటున్నది. కేటీఆర్ వస్తున్నారనే మాట చాలు. మండే ఎండల్లోనూ తండోపతండాలుగా వస్తున్నారు. ఆయన చెప్పే మాటలను చెవిపెట్టి వింటున్నారు. సూర్యాపేట సభలో అయితే మాజీ సర్పంచ్ రాధ చివరిదాకా కన్నీరు కారుస్తూ కూర్చోవడం అందరినీ కదిలించింది. 'రామన్నా సేవ్ తెలంగాణ' అనే నినాదాలు రాసిన ప్లకార్డులు సభల్లో కనిపించడం విశేషం. ఆత్మీయులకు బాధలు చెప్పుకొంటే సగం భారం దిగిపోతుందన్న పెద్దల మాట ఇక్కడ గుర్తుకువస్తున్నది. ప్రజలు కష్టనష్టాలు చెప్పుకొంటుంటే కేటీఆర్ ఓపికగా వింటున్నారు. తానూ అనునయ వాక్యాలు చెప్తున్నారు. అవును పొరపాటు జరిగింది. అరచేతిలో స్వర్గాన్ని చూపితే ఆదమరచి ఓటు వేసిన పాపానికి ఐదేండ్ల శిక్ష మనకు మనమే వేసుకున్నామనే భావన ప్రజల్లో ఉన్నది. దాన్ని కేటీఆర్ అరటి పండు వలిచి పెట్టినట్టు వివరంగా చెప్తుంటే ప్రజలు ఇది మా మనసులోని మాటే అని ఆసక్తితో వింటున్నారు. ఆమోదంతో తలలూపుతున్నారు.

ఏ రాజకీయ పార్టీకైనా అధికారమే పరమావధిగా ఉంటుంది. ప్రస్తుత సీఎం రేవంత్ అయితే ముఖ్యమంత్రి పదవి చేజిక్కించుకోవడమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేశానని పలు సందర్భాల్లో చెప్పుకొన్నారు. కానీ, బీఆర్ఎస్‌కు అధికారం, కేసీఆర్‌కు సీఎం పదవి అంతిమ లక్ష్యాలు కావు. ఎన్నోసార్లు పదవులను తృణప్రాయంగా వదిలేసుకున్న చరిత్ర కేసీఆర్‌ది. తెలంగాణ రాష్ట్రం బాగోగులు, తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం పనిచేయడమే ఆయన అసలైన లక్ష్యం. అప్పుడైనా, ఇప్పుడైనా ప్రజల కోసమే పనిచేస్తామన్న కేటీఆర్ మాటలు కార్యకర్తలకు కర్తవ్యబోధ చేస్తున్నాయి. రెండు విడుతలుగా ప్రజలిచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్రాన్ని అంగరంగ వైభోగంగా వెలిగేలా చేసిన కేసీఆర్‌కు మరో విడత సీఎం పదవితో కొత్తగా ఒరిగేదేమీ ఉండదు. ఇప్పటికిప్పుడు అధికారం కావాలని బీఆర్ఎస్ వెంపర్లాడటం లేదు కూడా. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 'రైతుబంధుకు రాంరాం, దళితబంధుకు జై భీమ్' చెప్తారని కేసీఆర్ చెప్పిన మాటను ప్రజలు ఇప్పుడు గుర్తుచేసుకుంటున్నారు. కాంగ్రెస్ పట్ల కేసీఆర్ అంచనాలు ఎంత ఖచ్చితమైనవో కేటీఆర్ వివరిస్తుంటే ప్రజలు నిజమే కదా అని విస్తుపోతున్నారు. కేటీఆర్ ఆప్త వాక్యాన్ని అర్థం చేసుకుంటున్నారు. అందులోని సారాన్ని మనసులో నింపుకొంటున్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని ఎంతగా ఉన్నా మనది ఓటుతో తీర్పు చెప్పే ప్రజాస్వామ్యమని, శాసనపరమైన, రాజ్యాంగ పరమైన పరిమితులు ఎన్నో ఉంటాయని కేటీఆర్ వివరించిన తీరు రాజకీయాల్లో బీఆర్ఎస్ నిజాయితీకి, రాజకీయ పరిణతికి నిలువెత్తు అద్దం పడుతున్నది. జరిగిన తప్పు సరిదిద్దుకునేందుకు ఇంకా మూడున్నరేండ్ల సమయం పడుతుందన్న కేటీఆర్ మాట బీఆర్ఎస్ చిత్తశుద్ధిని చాటిచెప్తున్నది. అవకాశవాదాన్ని, అధికార దాహాన్ని ఎన్నడూ దరిచేరనీయని, ప్రజలతో విడదీయరాని అనుబంధం కలిగిన పార్టీ బీఆర్ఎస్ మాత్రమే. ఇది పాతికేండ్ల చరిత్ర నిరూపించిన నిజం.

ఇంట ఓడి రచ్చ ఓడుతున్న సీఎం

టంకశాల అశోక్

ఇంట గెలిచి రచ్చ గెలువమన్నది పెద్దలు చెప్పే హితవు. ఒక ముఖ్యమంత్రి ఇంట గెలవడమంటే తన చుట్టూ ఉన్న సమస్యలను పరిష్కరించి, ఇంటిని చక్కదిద్ది, ప్రజల మనసులను ఆకట్టుకొని పునాదిని పటిష్ఠపరుచుకోవడం. ఆ పని చేసినప్పుడు తన ప్రతిష్ఠ బయట కూడా విస్తరిస్తుంది. ఇంట గెలవడంలో తగు అనుభవాలు రావటం వల్ల రచ్చ గెలిచేందుకు ఆధారాలు ఏర్పడుతాయి. ప్రజలు సైతం తన వెంట నిలుస్తారు. అంతమాత్రాన రచ్చ గెలిచి తీరుతారనే హామీ ఉండకపోవచ్చు, అది పరిస్థితులపై ఆధారపడి కూడా ఉంటుంది. కానీ, తన స్థానిక రంగం మాత్రం అందుకు సిద్ధమవుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ పెద్దల హితవు తెలియదనలేము. కానీ, ఎందువల్లనో ఆయన అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మొదట ఇంట ఓడి, ఇప్పుడు రచ్చ కూడా ఓడుతున్నారు.

ఇందులో ఆశ్చర్యం లేదు. ఇంట గెలిచి పునాదిని సృష్టించుకోనప్పుడు అనివార్యంగా బయట కూడా ఓటమి ఎదురవుతుంది. రేవంత్ రెడ్డి గత 15 మాసాలుగా ఇంట ఓడటాన్ని చూస్తూనే ఉన్నాం. అందుకు జాతీయస్థాయిలో గానీ, ఇతర రాష్ట్రాలలో గానీ, కొంతకాలం వరకూ ప్రచారం రాలేదు. ఒక విషయం మనకు ఇక్కడ ఎంత ముఖ్యంగా తోచినా, బయటివారికి తమ ప్రపంచం తమకు ఉంటుంది. ఏదైన చాలా పెద్ద పరిణామమో, సంచలనాత్మకమో అయితే తప్ప, ఆ వార్తలు వారి ప్రపంచంలోకి ప్రవేశించవు. ఆ ప్రకారం చూసినప్పుడు, రేవంత్ రెడ్డి పేరంటూ బయటివారు మొదటిసారిగా విన్నది 2023 డిసెంబర్ అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ గెలిచినప్పుడు. ఆ వెంటనే పేరు మరిచిపోయారు కూడా. అందులో వారికి కనిపించింది తాము ఎంతగానో విన్న, ప్రశంసించిన, కేసీఆర్ అనూహ్యంగా ఓడటమే తప్ప, రేవంత్ రెడ్డి ఒక చర్చనీయాంశం కాలేదు. తర్వాత కాలంలో ఆయన గురించి అంతో ఇంతో తెలుసుకున్న సమాచారం కూడా, తనకు విలువ ఏమీ తెచ్చిపెట్టటం లేదు.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక నిండు ఏడాది కాలమంతా అనామకంగానే గడిచిపోయింది. ఆ కాలంలో ఆయన ఢిల్లీలో అధికారిక హోదాలో పలు సమావేశాలలో పాల్గొన్నప్పటికీ ఎవరి దృష్టికీ పెద్దగా రాలేదు. అటువంటి సందర్భం మొదటిసారిగా 2024 నవంబర్‌లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ, 2025 ఫిబ్రవరి నాటి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయాల్లో ఏర్పడింది. ఒకవేళ ఆయన అంతకు ముందు ఏడాది కాలంలో తెలంగాణలో తన పరిపాలన ద్వారా ఇంట గెలవడం అన్నది జరిగి ఉంటే ఆ దృష్టి సానుకూలంగా ఉండేది. అటువంటిది లేకపోగా ఆ రెండు రాష్ట్రాలలో తన ప్రచార ధోరణులు ఎదురు తిరిగి తనకే ప్రతికూలంగా మారాయి. అందుకు మూడు విషయాలు తోడయ్యాయి. ఒకటి, తెలంగాణలో ఇచ్చిన హామీల అమలులో, ఇతరత్రా కూడా వైఫల్యాలు. ఆ వివరాలు బయటి ప్రజలు అప్పటికే ఒక మేర వినగా, అక్కడి కాంగ్రెస్ ప్రత్యర్థులు చేసిన ఎన్నికల ప్రచారం సందర్భంగా మరికొంత తెలిసివచ్చాయి.



రెండు, తన ప్రచార సమయంలో అక్కడి పత్రికలలో తెలంగాణ హామీల అమలు గురించి అబద్ధపు ప్రకటనలు ఇవ్వటం, మీడియా సమావేశాలతో పాటు బహిరంగ సభలలో అవే అబద్ధాలు చెప్పడం, వీటిని తలదన్నుతూ ఆ బయట రాష్ట్రాలలో కాంగ్రెస్ హామీల అమలు బాధ్యత తనదని సాహసోపేతంగా ప్రకటించటం. అవన్నీ ఆయనను నవ్వుల పాలు చేశాయి. ఇక మూడవది, ఇంత చేసినా మహారాష్ట్రలో కాంగ్రెస్ సీట్లు పోయి నసారి కన్నా తగ్గగా, ఢిల్లీలో గత రెండు మార్ల వలె ఈసారి కూడా సున్నా దగ్గరే ఆగిపోవడం.

యథాతథంగా ఈ పరిణామాలే రేవంత్ రెడ్డికి నవంబర్ 2024 నుంచి ఫిబ్రవరి 2025 మధ్య 4 నెలల కాలంలో 'జాతీయస్థాయి గుర్తింపు'ను మొదటిసారి తెచ్చిపెట్టగా, ఆ తర్వాత కొద్ది వారాలకు ఆయన ఢిల్లీ ఫలితాల గురించి చేసిన వ్యాఖ్యలు అందరినీ ఉలిక్కిపడేలా చేసి, ఆ 'గుర్తింపు'ను మరింత పెంచాయి. ఢిల్లీలో ఆప్ ఓటమికి కాంగ్రెస్ నెగెటివ్ పాత్ర ఒక కారణమని అందరికీ అర్థమైంది. అయితే, తమ పాత్ర గురించి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దౌత్య నీతి చాతుర్యంతో మాట్లాడుతూ, తాము ఆప్ వైఫల్యాలను ప్రజల దృష్టికి బాగానే తీసుకువెళ్లగలిగాము కానీ, బీజేపీని ఓడించలేకపోయాం అన్నారు. దౌత్య నీతిలో తగినంత కపటం ఉంటుందని తెలుసు కానీ, రేవంత్ రెడ్డికి దౌత్యం, కపటం రెండూ తెలియవు గనుక, కనీసం ఈ సందర్భంలోనైనా తెలియలేదు గనుక, ఆ పార్టీ కాంగ్రెస్‌ను హర్యానాలో ఓడించిందని, అందువల్లనే తాము వారిని ఢిల్లీలో కావాలనే ఓడించామని కన్‌ఫెషన్ బాక్స్‌లో నుంచి మాట్లాడినట్టు ప్రకటించి వేశారు. ఢిల్లీ ఎన్నికల చర్చ జాతీయస్థాయిలోఇంకా సద్దుమణగలేదు కనుక రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఒక్కసారిగా సంచలనమయ్యాయి. ఇంతకూ విషయమేమంటే ఆ సరికి ఆయనకు లభించడం మొదలైన జాతీయస్థాయి నెగటివ్ గుర్తింపు, ఈ వ్యాఖ్యల వల్ల మరింత పెరిగింది. రచ్చ ఓడటం విస్తరించింది.

ఇదంతా గతం. ఇక వర్తమానానికి వద్దాం. గతం గురించి ఇంతగా చెప్పుకోవటం ఎందుకంటే, వర్తమానానికి గతం ఒక నేపథ్యంగా పనిచేస్తుంది కనుక. ఇంకొంత సూటిగా మాట్లాడుకోవాలంటే, ఏడాది కాలం ఇంట ఓడిన ముఖ్యమంత్రి ఆ పునాదులపై నిలిచి రచ్చ ఓడటం ఈ విధంగా మొదలైందన్నమాట. ఇంట ఓడిన తీరు ఏమిటో ఈసరికి తెలంగాణలో ఆబాల గోపాలానికి తెలిసిందే గనుక, బహుశా ఇక్కడ మళ్లీ రాయనక్కరలేదు. ఇంకా చెప్పాలంటే వైఫల్య సమాచారాలు ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు అంతటా వ్యాపించడం మొదలైంది. రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను గత ప్రభుత్వంపైకి నెట్టజూస్తున్నారని అందరికీ అర్థమైంది. గత ప్రభుత్వ విజయాలు మరింతగా తెలిసివచ్చాయి. కష్టాలు ఒంటరిగా రావన్నట్టు, అప్రతిష్టలు ఒంటరిగా రాకపోవటమన్నది గమనించవలసిన మరొక ముఖ్య విషయం. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రస్తుతం మూడు మిగిలాయి. తెలంగాణ వలెనే హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక కూడా హామీల అమలు వైఫల్యాలతో పాటు ఇతరత్రానూ చెడ్డపేరు తెచ్చుకుంటున్నాయి. దానితో, జాతీయస్థాయిలో, దేశవ్యాప్తంగా మొత్తం మూడు రాష్ట్రాలను కలిపి చర్చిస్తున్నారు. మూడింటికి 'అంటుల్లా' అయిందన్నమాట. ఇది చాలదన్నట్టు కాంగ్రెస్ తనదే పెత్తనం అన్నట్టు నడిపించజూసిన ఇండియా కూటమి చిందరవందర అవుతుండటం, రాహుల్‌గాంధీ నాయకత్వ బలహీనతలు గతంలోనే తెలిసినా ఇప్పుడు మరింత బయటపడటం అనే వాటి ప్రభావాలు రేవంత్ ప్రతిష్ఠను ఇంకా నష్టపరుస్తున్నాయి.

సరిగా ఈ పరిణామ క్రమాల నుంచి మొదలై, పూర్తిగా ఇటీవలి వారాలు, నెలల్లో జరుగుతూ వస్తున్నవి కొన్నున్నాయి. రేవంత్‌రెడ్డి గురించి ఇప్పుడు తగినంత తెలిసింది గనుక, ఆయన మాటలను, చేతలను బయటి వారూ లోగడ కన్నా ఎక్కువగా గమనించడం మొదలైంది. ప్రశ్నించడం కూడా.

తాను అధికారంలోనైనా లేని పదేండ్ల క్రితం ఓటుకు నోటు కేసును తిరగదోడి ప్రశ్నించడం నుంచి మొదలుకొని, కేవలం కేసీఆర్‌ను బదనాం చేయాలనే ఉద్దేశంతో, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుత లోటుపాట్లను బీఆర్ఎస్ పాలనకు ఆపాదించజూసిన బలహీనపు ఎత్తుగడల వరకు అన్నీ జాతీయ మీడియాకు, పార్టీలకు, పారిశ్రామిక వర్గాలకు, పరిశీలకులకు అర్థమైపోతున్నాయి. హామీలకు, జీతాలకు, అభివృద్ధి వ్యయానికి డబ్బు లేదని ఇండియా టుడే కాంక్లేవ్‌లో చెప్పటం అందుకు కేసీఆర్ అప్పులు కారణమనటం, ఓట్ల కోసమే అలవి కాని హామీలిచ్చామనటంతో తన పరువు అక్కడి యమునా నది మురికిలో కలిసింది. ఆ విధంగా తనకు రాష్ట్రస్థాయిలో ఇంకా ప్రతిష్ఠ రాకముందే అప్రతిష్ఠ మొదలైనట్టు జాతీయస్థాయిలోనూ ప్రతిష్ఠ ఎప్పుడు కలగకపోగా అప్రతిష్ఠ మొదలై పెరుగుతున్నది. ఇంట ఓడిన సీఎం రచ్చ ఓడుతున్నారు. చివరికి ఆయన పేరు సైతం ఇక్కడ పలువురికి వెంటనే గుర్తుకు రాకపోతున్నట్టు, జాతీయ స్థాయిలోనూ అదే పరిస్థితి కనిపిస్తున్నది.

దీనంతటికీ కొసమెరుపు అన్నట్టుగా రేవంత్ రెడ్డి భాషా వైదుష్యం కూడా తెలంగాణ జిల్లాలను దాటి ప్రయాణించడం మొదలైంది. తాజా ఉదంతం ఆయన ఇద్దరు మహిళా జర్నలిస్టుల గురించి సాక్షాత్తు అసెంబ్లీలో మాట్లాడుతూ వారి బట్టలూడదీసి కొడతానని, ఊరేగిస్తానని హెచ్చరించడం, ఇది తెలిసిన బయటి జర్నలిస్టులే గాక అందరూ దిగ్భ్రాంతి చెందారు.

వారి విచారణ క్రమంలో, ఆయన భాష ఎప్పుడూ ఇంతేనన్నది దృష్టికి వస్తున్నది. లోగడ ఇంకా ఏమేమి అన్నారో తెలుసుకుంటున్నారు ఇప్పుడు. కొద్దిమంది, తను ముఖ్యమంత్రి అయిన కొత్తలోనే బీహార్‌కు చెందిన ఐఏఎస్ అధికారుల గురించి 'బీహార్ డీఎన్ఏ' అంటూ నిందాపూర్వకంగా అన్న మాటలను గుర్తుచేస్తున్నారు. ఇతర విషయాలకు అదనంగా ఆయన భాష విషయంలోనూ ఇంట ఓడి రచ్చ ఓడుతున్నారు. తనను కాంగ్రెస్ అధినాయకత్వం నియంత్రించకపోవడం కూడా బయటి ప్రపంచపు ఆశ్చర్యానికి కారణమవుతున్నది. వీడియోల భాషను ఎవరూ సమర్థించడం లేదు గానీ, ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి, అందులోనూ అసెంబ్లీలో, ఈ ధోరణి చూపడం వారికి అర్థం కావడం లేదు.

ముఖ్యమంత్రి వల్ల, తన పరిపాలన వల్ల, వ్యక్తిగతంగా తనకే గాక ఒక రాష్ట్ర ప్రతిష్ఠ పెరగటం, తగ్గటం జరుగుతుంది. రెండింటి మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది. కేసీఆర్ సాగించి సాధించిన ఉద్యమ లక్ష్యం, తర్వాత పదేండ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాల వల్ల తెలంగాణకు జాతీయస్థాయిలో, దేశవ్యాప్తంగా గుర్తింపు, గౌరవాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు బయటి ప్రపంచం 2001-14, 2014-24 కేసీఆర్ నాయకత్వ కాలాలను ప్రస్తుత ముఖ్యమంత్రి వ్యక్తిత్వంతో, పరిపాలనతో పోల్చిచూడటం మొదలైంది.

సరళమైన భాష బలమైన సందేశం

లోక్‌సభ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ అంశంపై 2025, మార్చి 23 నాడు చెన్నైలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల రాజకీయ పార్టీల సమావేశం దేశ రాజకీయాల్లో ఒక కీలకమైన ఘట్టంగా మిగిలిపోతుంది. పాతకాలం నాటి డీ లిమిటేషన్ విధానాన్ని అమలుచేస్తే దక్షిణాదికి కలిగే నష్టంపై నిర్వహించిన ఈ సమావేశంలో ఒక అద్భుతమైన సన్నివేశం ఆవిష్కృతమైంది.

సమకాలీన రాజకీయాల్లోని స్వార్థపూరిత ధోరణులు, గెలుపు-ఓటములు, అధికార పదవుల చుట్టూ తిరిగే సాధారణ రాజకీయ ప్రసంగాలకు విభిన్నంగా, వినూత్నంగా, విప్లవాత్మకంగా ఓ స్వరం వినిపించింది. ఈ సమావేశాలకు హాజరైన ముఖ్యమంత్రులు, సీనియర్ నేతల్లో అతి చిన్న వయస్సు కేటీఆర్‌ది. అయితే, వాగ్దాటితో కూడిన భాషా ప్రయోగంగా మాత్రమే కేటీఆర్ ప్రసంగాన్ని చూడవద్దు. భారత జాతి నిర్మాణంలో దశాబ్దాల పాటు అపూర్వ భాగస్వామ్యం అందించిన దక్షిణాదికి డీ లిమిటేషన్ వల్ల జరిగే నష్టాలను, అందుకు పరిష్కారాలను సూచించిన తీరు అద్భుతంగా తోచింది. 12 నిమిషాల పాటు సాగిన కేటీఆర్ ప్రసంగం దేశ రాజకీయ ప్రసంగాల్లో అత్యంత కీలకమైన ప్రసంగంగా చరిత్రలో నిలిచిపోతుంది.

కేటీఆర్ తన ప్రసంగాన్ని తెలంగాణ అస్తిత్వం, ఉద్యమ చరిత్రను గర్వంగా జాతీయ రాజకీయ వేదికపై సొంతం చేసుకుంటూ, దేశ అస్తిత్వ రాజకీయాల్లో ద్రవిడ ఉద్యమం, తమిళ ఉద్యమాల స్ఫూర్తిని ప్రస్తావిస్తూ ప్రారంభించారు. ఈ దేశం చైనా, రష్యా వంటి ఏకరీతి కలిగిన దేశం కాదని, భిన్నమైన బహు సంస్కృతులు, భాషా, భౌగోళిక విభిన్నతను కలిగిన రాష్ట్రాల సమాహారమని, రాజ్యాంగం ప్రస్తావించిన అంశాన్ని ప్రారంభంలోనే ప్రస్తావించి, ప్రసంగానికి ఒక ప్రాతిపదికను తయారుచేశారు. పద్నాలుగేండ్ల పాటు కేసీఆర్ నాయకత్వంలో స్వరాష్ట్ర సాధన కోసం జరిగిన అపూర్వమైన తెలంగాణ ఉద్యమ ప్రస్థానాన్ని కేటీఆర్ భావోద్వేగంగా ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న డీ లిమిటేషన్ విధానంలో లోక్‌సభ స్థానాలను పెంచితే ఉత్తరాదికి కలిగే మందబలం వల్ల జరిగే నష్టాన్ని ప్రస్తావించేందుకు, అంబేద్కర్ వంటి మహనీయులు చెప్పిన మెజారిటీ నియంతృత్వం అన్న పదబంధాన్ని ఉపయోగించి, మందబలం వల్ల కలిగే నష్టాలను, అరువై ఏండ్ల పాటు అనుభవించిన తెలంగాణ ఉద్యమ అనుభవాన్ని కలిపి ప్రస్తావించారు. ఆ వెంటనే డీ లిమిటేషన్ వల్ల దేశాభివృద్ధిలో అద్భుతమైన భాగస్వామ్యాన్ని దశాబ్దాలుగా అందిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు జరిగే తీవ్ర నష్టాన్ని గట్టిగా చెప్పారు. దేశ హితం కోసం జనాభాను నియంత్రించుకొని, అద్భుతమైన పరిపాలన, ఆర్థిక విధానాలతో ప్రగతి సాధించి, జీడీపీలో 36 శాతం వాటా ఇస్తున్న దక్షిణాదికి దశాబ్దాలుగా జరుగుతున్న వివక్షను, అన్యాయాన్ని ప్రస్తావించినప్పుడు, ఆయన గొంతులో ఆవేదనతో పాటు దక్షిణాది సాధించిన ప్రగతిపైన గర్వం కనిపించింది.

తనకున్న పరిమిత సమయంలో అనేక అంశాలను, రాజకీయ ఫిలాసఫీని, రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్యానికి నియంతృత్వానికి ఉన్న తేడాను, డీ లిమిటేషన్ వంటి సంక్లిష్ట సమస్యను, దాని పరిష్కార మార్గాలను అద్భుతంగా వ్యక్తపరిచారు. ప్రపంచంలో ఎక్కడైనా క్రమశిక్షణతో పురోగతి సాధించిన ప్రాంతాలకు ప్రతిఫలం దక్కుతుంది కానీ, ఈ డీ లిమిటేషన్ విధానంలో కేంద్రం శిక్షించే కుట్ర చేస్తుందని స్పష్టం చేశారు. ఆనాటి భారతదేశ నిర్మాతల అపూర్వ జ్ఞానాన్ని, దీర్ఘ దృష్టిని, వారు సూచించిన మార్గాన్ని కేటీఆర్ మరోసారి దేశానికి గుర్తుచేసిన తీరు అపూర్వంగా అనిపించింది.

డీ లిమిటేషన్ చేయాల్సిందే అని భావిస్తే, కచ్చితంగా అంబేద్కర్ వంటి మహనీయులు సూచించిన స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, ఫెడరల్ స్ఫూర్తి, రాష్ట్రాల హక్కులు, దేశ విభిన్నతను కాపాడాల్సిన బాధ్యత వంటి అనేక అంశాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలని, రాష్ట్రం చిన్నదైనా పెద్దదైనా నిర్లక్ష్యానికి గురవకుండా చూడాలని స్పష్టం చేశారు. అంతేకాదు, ఆయా రాష్ట్రాలు సాధించిన ఆర్థిక ప్రగతి, పరిపాలన విధానాలు, అభివృద్ధి వంటి అన్నింటినీ దృష్టిలో పెట్టుకోవాలని, రాష్ట్రాలు దేశానికి అందిస్తున్న భాగస్వామ్యం మేరకు ప్రాతినిధ్యం ఇవ్వాలని, పరిపాలన సౌలభ్యం కోసమైతే ఎంపీల సంఖ్య అలాగే ఉంచి, ఎమ్మెల్యేల సంఖ్యను జనాభా ప్రాతిపదిక మేర పెంచుకునే విధానాన్ని అనుసరించాలనే పరిష్కారాలను సూచించారు.

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల అనుబంధం అన్నదమ్ముల మాదిరి ఉండాలని, కేంద్రం పెద్దన్న మాదిరి ఉండాలి కానీ, టీవీ షోలో బిగ్‌బాస్ మాదిరిగా కాదని చురకలు అంటించిన చాతుర్యం అందరినీ ఆకట్టుకున్నది. కో-ఆపరేటివ్ ఫెడరలిజం అంటూ నీతులు వల్లె వేస్తున్న కేంద్రం, డీ లిమిటేషన్ వంటి సంక్లిష్టమైన అంశం వచ్చేసరికి కోహెర్సివ్ ఫెడరలిజం దిశగా అడుగులు వేస్తుందని, బలమైన రాష్ట్రాలు ఉన్నప్పుడే బలమైన దేశం ఉంటుందన్న కామన్ సెన్స్‌ను కేంద్రం గుర్తించాలని చెప్పిన తీరు, మొత్తం డీ లిమిటేషన్ వ్యవహారంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టింది.

కేటీఆర్ ప్రసంగం ఈ రోజు ఉన్న సంక్షోభ రాజకీయ పరిస్థితుల్లో ఒక వెలుగు రేఖగా నిలుస్తుంది. సమాచారం, స్పష్టత, భావోద్వేగం, సరళమైన భాషతో బలమైన సందేశాన్నిచ్చి, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ జమానాలోనూ 12 నిమిషాల్లో సంక్లిష్టమైన రాజకీయ అంశాలను దేశ ప్రజలకు అర్థమయ్యేలా చెప్పవచ్చని నిరూపించింది. రాజకీయ నాయకులు కేవలం అధికారాలు, పదవులు, ప్రచారాల కోసం కాకుండా, సమాజ హితం కోసం, దేశ హితం కోసం నిజాయితీగా మాట్లాడాల్సిన అవసరాన్ని ఎత్తిచూపింది. నిన్న చెన్నై సమావేశంలో కేటీఆర్ ప్రసంగం సంక్లిష్టమైన డీ లిమిటేషన్ చర్చకు ఆజ్యం పోసే నిప్పు కణికగా నిలిచింది. అయితే, ఈ నిప్పు కణిక దేశ భవిష్యత్తును పునర్నిర్మించే యజ్ఞం ప్రారంభానికి ఉపయోగపడే దక్షిణాగ్నిగా, శుభకరమైన సంకేతంగా నిలవాలని, డీ లిమిటేషన్ వివాదానికి అర్థవంతమైన, ప్రజాస్వామిక, న్యాయమైన ముగింపు రావాలని ఆశిస్తున్నాను.

- డాక్టర్ అయాన్ రాజన్న

అడ్డగోలు అంకెలు, అబద్ధాల రంకెలు

పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధి ముఖచిత్రం. బడ్జెట్ అంటే ఓ భరోసా, బతుకుదెరువు. కానీ, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో రెండోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మరోసారి అంకెలు రంకెలేసినయి. ఒక ఆర్థిక వ్యవస్థ బాగుందని చెప్పేందుకు మూలధన వ్యయం, అప్పుల వృద్ధి తీరును పరిగణిస్తారు. ఆ లెక్కలన్నీ ఒకటికి పది సార్లు చూశాక అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడతారు. ఆ పద్దుపై ప్రజా సమూహంలో చర్చించే క్రమంలో ఆర్థిక క్రమశిక్షణ, పాలనానుభవం, రాష్ట్ర భవిష్యత్తుపై ఓ విజన్ ప్రస్ఫుటమవుతుంది.

బడ్జెట్‌లో అందమైన అబద్ధాలతో అంకెలేసినా, మందబలంతో రంకెలేసినా కాగ్ లెక్కలు, అధికార గణాంకాలెవ్వరూ దాచిపెట్టలేరు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను రోజురోజుకు ఏ విధంగా ఏమార్చుతున్నదో ఇటీవలి బడ్జెట్ స్వరూపం స్పష్టం చేస్తున్నది. ఆర్థిక క్రమశిక్షణలో, జవాబుదారీతనంలో కేసీఆర్‌ను మించినవారెవ్వరూ లేరని భట్టి పద్దు రూడీ చేస్తున్నది. 2025-26 వార్షిక బడ్జెట్ రంగులతో మెరిపించడం తప్ప, జనాన్ని మాత్రం మురిపించలేదు. ఈసారి కేవలం 5 శాతంతో పెంచిన బడ్జెట్ చూస్తే దున్నపోతుకు పాలు పిండినట్టుంది. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క రెండోసారి ప్రవేశపెట్టిన రూ.3,04,965 కోట్ల బడ్జెట్ నీటి బుడగ వంటిదే. ఆయన పద్దులో ఆదాయం అంతకంతకూ క్షీణిస్తున్నదని తెలియజేస్తున్నది. తెలంగాణ సహజ సంపదను అమ్మేయాలనే స్పష్టమైన కుట్ర ఈ బడ్జెట్ ద్వారా తేటతెల్లమైంది. గచ్చిబౌలిలో 400 ఎకరాలను వేలం వేయడం ద్వారా రూ.30 వేల కోట్లు రాబట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే పారిశ్రామిక భూములు తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల అప్పు తెచ్చి, ఇప్పుడేమో హెచ్ఎండీఏ ఆస్తులు తాకట్టు పెట్టి మరో 20 వేల కోట్ల అప్పు తెస్తమని నిండు అసెంబ్లీలో చెప్పడం విడ్డూరం. హెచ్ఎండబ్ల్యూఎస్, జీహెచ్ఎంసీ ఆస్తులు తాకట్టు పెట్టి మరో రూ. 20 వేల కోట్ల అప్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. హౌజింగ్‌బోర్డు భూముల అమ్మకం ఇప్పటికే షురూ అయింది